

విద్యాబోధన సాగేదెలా?


- గిరిజన తండాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలే అధికం
- ఐదు తరగతులున్న బడుల్లోనూ ఒక్కరే ఉపాధ్యాయుడు
- ఆయన రాకపోతే ఆ రోజు బోధనకు సెలవు

6

సంబురంగా.. సాగు

- ఉమ్మడి జిల్లాలో ఆశాజనకంగా ఖరీఫ్ సీజన్
- పత్తి సాగు వైపే మొగ్గు చూపుతున్న రైతులు
- సన్నాల సాగుకూ సిద్ధం
- జూలై మొదటి వారంలోనే కాల్వల ద్వారా నీటి విడుదల
- నకిలీ విత్తనాలను అరికట్టలేకపోతున్న అధికారులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వానాకాలం సాగు సంబురంగా సాగుతోంది. మునుపెన్నడూ లేనంతగా రోహిణి కార్తెలో వర్షాలు కురవడంతో వర్షాధార పంటలు జోరందుకున్నాయి. జూన్ మాసంలో కూడా వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. నారాయణపేట కందికి రెండు తెలుగు రాష్ట్రాల్లో డిమాండ్ ఉండటంతో ఆ ప్రాంత రైతులు అధికంగా కంది సాగు చేస్తున్నారు. నాగర్‌కర్నూల్, గద్వాల జిల్లాలో పత్తి సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి బోనస్ రూ.500 చెల్లిస్తుండటంతో బోరుబావులు, కాలువల కింద సన్నరకం వరి సాగుకు రెండో ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగు విస్తీర్ణానికి సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచినట్లు అధికారుల ద్వారా తెలిసింది.



విత్తనాలు వేసేందుకు అచ్చులు కొడుతున్న రైతు(ఫైల్)

నాగర్‌కర్నూల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగు సంబురంగా కొనసాగుతోంది. రోహిణి కార్తెలో రోళ్లు పగులుతాయనే నానుడికి విరుద్ధంగా అదే కార్తెలో వర్షాలు కురియడం, మృగశిర కార్తె కూడా సాగుకు అనుకూలించడంతో ఉమ్మడి జిల్లాల్లో రాబోయే పంటల దిగుబడిపై ఆశావ పరిస్థితి కన్పిస్తోంది. జూన్ మాసంలో వర్షపాతం కూడా ఆశించిన స్థాయిలో ఉండడంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గతేడాది అధిక వర్షాలు చీడపీడలతో నష్టపోయిన పత్తి రైతులు ఈ సారి కూడా ఆ పంట సాగువైపే ఆసక్తి చూపుతున్నారు.

పత్తి సాగువైపే మొగ్గు..

ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట జిల్లాలు ఉండగా అక్కడ భౌగోళిక వాతావరణ సంప్రదాయ పంటల వైపు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది కూడా నారాయణపేట జిల్లాలో 1.40లక్షల ఎకరాల్లో కంది పంట సాగు చేయనున్నారు. ఇక్కడ కంది పంటకు ఉమ్మడి తెలుగు రాష్టాలతో పాటు కర్ణాటకలో డిమాండ్ ఉంది.. ఈ జిల్లాలో 2,100 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా కాంప్లెక్స్ ఎరువులు సమృద్ధిగా ఉన్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈ సారి కూడా పత్తి పంట సాగుకే మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో 2,86,000 ఎకరాల్లో పత్తి, 52 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయనున్నట్లు అధికారులు గుర్తించారు. 40వేల టన్నుల యూరియా, 13వేల టన్నుల డీఏపీ అవసరమవుతుందని అంచనా వేశారు. వచ్చే నెల వరకు సరిపడా నిల్వలను అందుబాటులో ఉంచారు.



పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు(ఫైల్)

విత్తనంపై నకిలీలదే 'పెత్తనం'

ప్రభుత్వం నకిలీ విత్తనాలను అరికట్టడానికి ఎన్ని చర్యలు తీసుకుంటున్నా పెత్తనం మాత్రం వాటిదే కొనసాగుతోంది. వాణిజ్య పంట అయిన పత్తిని సాగు చేయడానికి ఉమ్మడి జిల్లా రైతాంగం ఆసక్తి చూపుతుండడం నకిలీ విత్తన వ్యాపారులకు వరంగా మారింది. గుంటూరు జిల్లా నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని ఐదు జిల్లాలో లూజు విత్తనాలను అమ్ముతూ దళారులు లక్షలు దండుకుంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటి వరకు పదుల సంఖ్యలో కేసులు నమోదవుతున్నా వ్యవసాయ శాఖకు చలనం లేకుండాపోయింది. ఈ సీజన్‌లో నారాయణపేట జిల్లాలో..

(మిగతా 6లో..)

లోపలి పేజీల్లో..



కౌజు పిట్ట..
లాభాల పుట్ట

- పెంపకంపై యువకుల ఆసక్తి
- మాంసానికి మంచి డిమాండ్

7



నల్లమలలో
ట్రైనీ ఐఏఎస్‌లు

- ఫర్హాబాద్ వ్యూపాయింట్ సందర్శన
- అభివృద్ధి పనులపై అధ్యయనం

7



పారిశుధ్యంపై
స్పెషల్ డ్రైవ్

- 21వ తేదీ వరకు రోజుకో కార్యక్రమం

7

పగటి పూట దొంగతనాలపై నిఘా

- అత్యాశతో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు
- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్



'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నారాయణపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పగటిపూట దొంగతనాలపై పోలీస్ యంత్రాంగం ప్రత్యేక నిఘా ఉంచి, నియంత్రించేలా చర్యలు తీసుకుంటోందని నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్ చెప్పారు. రద్దీగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

దొంగతనాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో గత ఏడాది కంటే దొంగతనాలు తగ్గాయి. జనాలు రద్దీగా ఉండే బస్టాండ్‌లలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారు చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల మరికల్ బస్టాండ్‌లో ఇద్దరు దొంగలను పట్టుకున్నాం. మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడ్డ ఇద్దరు కర్ణాటక దొంగలను పట్టుకున్నాము. విలువైన బంగారు ఆభరణాలు, నగదు ఉన్నప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

జిల్లాలో ఎన్ని సీసీ కెమెరాలు ఉన్నాయి?

జిల్లాలోని మక్తల్‌లో 80, నారాయణపేటలో 100, కోస్గిలో 20 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. రాత్రి వేళలో పెట్రోలింగ్ చేస్తున్నాం.

ఎక్కడెక్కడ మఫ్టీ బృందాలు ఉన్నాయి?

నారాయణపేట జిల్లా కేంద్రంలో సెంట్రల్ క్రైమ్ బృందం ఏర్పాటు చేశాం. మద్దూర్, నారాయణపేట, మరికల్, మక్తల్ సర్కిల్ పరిధిలో సీఐల ఆధ్వర్యంలో ఎస్ఐతో పాటు నలుగురు పోలీసులతో నాలుగు క్రైమ్ పార్టీ బృందాలను ఏర్పాటు చేశాం.

రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

రోడ్డు ప్రమాదాల నివారణకు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, పోలీస్ శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నాం. మక్తల్, నారాయణపేట, కోస్గిలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ బృందాలతో నిరంతరం తనిఖీలు చేస్తున్నాం. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేశాం. జిల్లాలో నాలుగు బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, బోర్డులు ఏర్పాటు చేశాం. వేగ నియంత్రణ కోసం తగిన చర్యలు తీసుకుంటున్నాం. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి.

జిల్లాలో సైబర్ క్రైమ్ రేట్ ఎలా ఉంది?

జిల్లాలో సైబర్ క్రైమ్ రేటు రెండేళ్లలో తగ్గింది. 2023లో 46 కేసులు నమోదు కాగా, 12 కేసులకు సంబంధించి నిందితులను అరెస్ట్ చేశాం. 2024లో 25 కేసులు నమోదు కాగా, రూ.1,63,000 నగదును బాధితులకు ఇప్పించాము. మరో రూ.1,15,000 కోర్టు ఆర్డర్ వచ్చిన వెంటనే బాధితల బ్యాంకు ఖాతాల్లో వేస్తాము. సైబర్ క్రైమ్‌కు పాల్పడ్డ ఐదుగురిని అరెస్టు చేశాం. అతి ఆశతో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి, మోసపోవద్దు

జాతీయ లోక్ అదాలత్‌లో ఎన్ని కేసులు పరిష్కారం అయ్యాయి?

ఈ నెల 14న జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లాలోని 12 పోలీస్ స్టేషన్‌ల పరిధిలో గల 2,816 కేసులు పరిష్కారం అయ్యాయి. జరిమానా రూపకంగా రూ.4,10,000 చెల్లించడం జరిగింది.



ఆస్పత్రి పనులను పరిశీలిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

ఆస్పత్రి పనుల పరిశీలన

- మక్తల్‌లో రూ.55 కోట్లతో 150 పడకల దవాఖాన
- ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్యం అందించేందుకు కృషి
- శరవేగంగా పనులు చేయాలి: మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో నిర్మిస్తున్న 150 పడకల ఆస్పత్రి పనులను రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం పరిశీలించారు. కాంట్రాక్టరుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రూ.55 కోట్లతో ఆసుపత్రి నిర్మిస్తున్నట్లు తెలిపారు. పనులు శరవేగంగా జరగాలని గుత్తేదారును ఆదేశించారు. మక్తల్ నియోజకవర్గ ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి, బోయ రవికుమార్, గడ్డంపల్లి హన్మంతు, కోళ్ల వెంకటేష్, ఆనంద్‌గౌడ్, రాయికోడ్ ఆనంద్, లక్ష్మణ్‌సింగ్, ఆడెం శ్రీనివాసులు, వాకిటి శ్యామ్, నీలప్ప, గద్వాల రవి, నాగరాజు, శివరాంరెడ్డి, కల్లూరి గోవర్దన్, నాగరాజు, చెన్నయ్యగౌడ్, సీఎస్ మూర్తి, దండు రాములు పాల్గొన్నారు.

ఉద్యోగుల పాట్లు.. కూలీల అగచాట్లు

- ఉపాధి కూలీలకు నాలుగు నెలలుగా అందని డబ్బులు
- పెండింగ్‌లో ఉన్న వాటిలోంచి రూ.10 కోట్లు విడుదల
- ఉద్యోగులకు అందని మూడు నెలల జీతం
- వ్యవసాయ పనులు మొదలవడంతో తగ్గిన సంఖ్య

మహబూబ్‌నగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులకు జీతాలు.. కూలీలకు డబ్బులు రావడం లేదు. దాంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదురక్కొంటున్నారు. నాలుగు నెలలుగా కూలీ డబ్బులు రాకపోవడంతో కూలీలు ధర్నాకు దిగాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో ప్రభుత్వం ఎట్టకేలకు ఇటీవల కూలీలకు మే 4 వరకు చేసిన పనులకు రాష్ట్రానికి రూ.73 కోట్లు విడుదల చేసింది. అందులో పాలమూరు ఉమ్మడి జిల్లాకు సంబంధించిన రూ.10 కోట్ల రావాల్సి ఉంది. ఆ డబ్బులు ఇంకా విడుదల కాలేదు. మరో రెండు మూడు రోజుల్లో కూలీల ఖాతాల్లో జమ అవుతాయని అధికార యంత్రాంగం చెబుతోంది. మే 4 నుంచి నెలన్నర రోజులకు సంబంధించిన కూలీ డబ్బులు మరో రూ.5 నుంచి రూ.6 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి.

తగ్గిన కూలీల సంఖ్య

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పనులు ప్రారంభం అయ్యాయి. రైతులంతా ఆరుతడి పంటలు వేసుకునే పనిలో బిజీ అయ్యారు. దీంతో ఉపాధి హామీ పనులన్నీ దాదాపుగా బంద్ అయ్యాయి. ఉపాధి కూలీలంతా వ్యవసాయ పనులకు వెళుతున్నారు. మే చివరి వారంలోనే వర్షాలు కురవడంతో అప్పటినుంచే కూలీల సంఖ్య తగ్గుతూ వస్తోంది. మే 25 వరకు దాదాపు పాలమూరు జిల్లాలో 26 వేల నుంచి 27 వేల మంది కూలీలు పనిచేయగా, ఆ తరువాత క్రమంగా తగ్గుతూ వస్తున్నారు. గత సోమవారం జిల్లాలో కేవలం 4,354 మంది మాత్రమే ఉపాధి పనులకు వచ్చారు. అంటే సగటున గ్రామానికి 10 మంది చొప్పున పని చేస్తున్నారు. అది కూడా హరితహారం పనులకు మాత్రమే వెళ్తున్నారు. నర్సరీలలో మొక్కల మెయింటెనెన్స్, నాటిన మొక్కలకు నీళ్ల పోయడం వంటి పనులు చేస్తున్నారు. అవెన్యూ, కమ్యూనిటీ, బ్లాక్ ప్లాంటేషన్ మొక్కలు నాటిస్తున్నారు. పొలం గట్ల వెంట కొబ్బరి చెట్లను కూడా నాటిస్తున్నారు. రానున్న 2-3 నెలలు కూలీల సంఖ్య తక్కువగానే ఉండనుంది.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

జీతాలు లేక అప్పులు

పథకంలో పని చేసే ఉద్యోగులకు 3 నెలలుగా జీతాలివ్వడం లేదు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ పథకంలో 1,150 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, 540 మంది టెక్నికల్ అసిస్టెంట్లు, 70 మంది వరకు ఏపీవోలు ఉన్నారు. వారికి మూడు నెలలకు దాదాపు రూ.11 నుంచి రూ.12 కోట్లు వరకు రావాల్సి ఉంది. జీతాలు రాకపోవడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

విద్యుత్‌షాక్‌తో స్తంభంపైనే.. వ్యక్తి మృతి

- నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం కంసానిపల్లి గ్రామంలో ఘటన

7



విద్యుత్ స్తంభంపైనే మృతి చెందిన మధునాసుల శేఖర్

పోలీస్ స్టేట్ డ్యూటీమీట్‌కు సెలెక్షన్స్

- జోనల్ జట్లు

ప్రతిభ చూపాలి: ఎస్పీ జానకి



డాగ్‌స్క్వాడ్ ప్రతిభను పరిశీలిస్తున్న ఎస్పీ

మహబూబ్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో జూలైలో నిర్వహించనున్న స్టేట్ డ్యూటీ మీట్ కోసం జోగుళాంబ జోన్ జట్టును ఎంపిక చేసే పనిలో జిల్లా పోలీస్ యంత్రాంగం నిమగ్నమైంది. ఆరు ఈవెంట్లలో ఈ డ్యూటీమీట్‌ను నిర్వహిస్తారు. అందుకు ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేసి పంపించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే బుధవారం జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో జోనల్ పోలీస్ అధికారులకు డ్యూటీమీట్ నిర్వహించారు. ఎస్పీ జానకి దగ్గరుండి పర్యవేక్షించారు. సైంటిఫిక్ ఎయిడ్ టు ఇన్వెస్టిగేషన్, విధ్వంసక నిరోధక తనిఖీ, డాగ్‌స్క్వాడ్ పోటీ, కంప్యూటర్‌పై అవగాహన, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలలో డ్యూటీమీట్ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్యూటీ మీట్ అనేది వినూత్నమైన వేదిక అని చెప్పారు. పోలీస్ వ్యవస్థలో ప్రతిభావంతులైన అధికారులు నైపుణ్యాలను ప్రదర్శించడానికి గొప్ప అవకాశంగా ఇది నిలుస్తుందన్నారు. ఎంపికైన పోలీస్ అధికారులు జూలైలో వరంగల్‌లో జరిగే డ్యూటీమీట్‌లో జిల్లా గర్వించేలా ప్రతిభ చూపాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీటీసీ డీఎస్పీ గిరిబాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్‌లు, ఆర్ఐలు, కోర్‌టీం ఇన్‌చార్జి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



ఇంటి మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

మూసాపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి హయాంలోనే పేద, బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలతో పాటు అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి దక్కుతుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బుధవారం మూసాపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో 255 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే మంజూరు పత్రాలను అందజేశారు. విడతల వారీగా అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇళ్లను ఇస్తామన్నారు. ప్రస్తుతం నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు కావడంతో వివిధ దశలో పనులు కొనసాగుతున్నాయన్నారు. వాటి నిర్మాణాలు పూర్తయిన వెంటనే అదనంగా మరో 1,000 ఇళ్లు మంజూరు అవుతాయని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక డబుల్‌బెడ్ రూమ్ ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. కళ్లబొల్లి మాటలతో మభ్యపెట్టారన్నారు. అనంతరం నాయకులు, మహిళలు ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో కృష్ణయ్య, మాజీ ఎంపీపీలు బగ్గికృష్ణయ్య, నాగార్జున్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

» కేంద్ర బృందం సభ్యుడు డాక్టర్ అబ్దుల్ వాసే



ఇటిక్యాల పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ఇటిక్యాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయడం తగదని కేంద్ర బృందం సభ్యుడు డాక్టర్ అబ్దుల్ వాసే అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఇటిక్యాల పీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ఆయుష్మాన్ భారత్ ఖాతాల నమోదు ఎంత వరకు పూర్తి చేశారని ఆరా తీశారు. ఎప్పటికప్పుడు షుగర్, హెచ్‌బీపీ, ఎల్‌ఎఫ్‌టీ, ఆర్‌ఎఫ్‌టీ పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. వైద్య సేవలను అందించడంలో అలసత్వం వహించొద్దన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రాధిక, సమన్వయ కర్త శ్యాంసుందర్, రమేశ్, శేఖర్, వైద్య సిబ్బంది వెంకటేశ్, ధనలక్ష్మి ఉన్నారు.

పౌరహక్కుల సంఘం నాయకుల అరెస్టు



ఇటిక్యాల పోలీసుస్టేషను వద్ద పౌరహక్కుల సంఘం నాయకులు

ఇటిక్యాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ పరిశ్రమ బాధిత గ్రామస్తులను పరామర్శించేందుకు వెళ్తున్న పౌరహక్కుల సంఘం నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా గ్రామస్థులు గతంలో చేపట్టిన ఆందోళన తీవ్రం కావడంతో పలువురిపై కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకులు హైదరాబాద్ నుంచి బయలు దేరారు. వారిని జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఎర్రవల్లి చౌరస్తాలో అలంపూర్ సీఐ రవికుమార్, ఎస్‌ఐ వెంకటేష్ వారిని అడ్డుకొని అరెస్టు చేసి, ఇటిక్యాల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరావు, జక్కా బాలయ్య విలేకరులతో మాట్లాడారు. బాధితులను కలిసి మాట్లాడేందుకు వెళ్తున్న తమను అడ్డుకోవడం హేయమైన చర్య అన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయొచ్చని, కానీ తమను అడ్డుకోవడం సమంజసం కాదని తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు వెంకటేశ్, లక్ష్మీనారాయణలు ఉన్నారు.

24 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



లోకుర్తి శివారులో పట్టుబడిన రేషన్ బియ్యం, నిందితుడితో పోలీసులు

నారాయణపేట/ దామరగిద్ద, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు చోట్ల టాస్క్‌ఫోర్స్, పోలీసు అధికారులు దాడులు చేసి దాదాపు 24 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నారాయణపేట జిల్లా, ధన్వాడ మండలం గోటూరు గ్రామానికి చెందిన దాసరి కృష్ణయ్య అనే వ్యక్తి లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి తన ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచుకున్నాడు. టాస్క్‌ఫోర్స్ అధికారులు, ధన్వాడ పోలీసులు బుధవారం సంయుక్తంగా దాడులు నిర్వహించి 12.80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చే సుకొని బుధవారం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

● దామరగిద మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన అనిల్ బుధవారం 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బొలెరో వాహనంలో కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్‌కు తరలిస్తున్నాడు. లోకుర్తి గ్రామ శివారులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. డిప్యూటీ తహసీల్దార్ ఆనందం పంచనామా అనంతరం, అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు పెరిగిన వరద

ధరూరు/దోమలపెంట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లోలు పెరిగాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ కురుస్తున్న వర్షాల కారణంగా ఇన్‌ఫ్లో పెరిగినట్లు అధికారులు తెలిపారు. బుధవారం కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయంలో 68.55 టీఎంసీలకు నీటి నిల్వ ఉండగా 45,733 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. నారాయణపూర్ జలాశయంలో 29.80 టీఎంసీలు నిల్వ ఉండగా 25,063 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. 19,877 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న జూరాల జలాశయానికి విడుదల చేస్తున్నారు. అందులో ఆరువేల క్యూసెక్కుల నీరు విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తుండగా 385 క్యూసెక్కుల నీరు కాలువల ద్వారా విడుదల చేస్తున్నారు. జూరాల జలాశయంలో 317.670 మీటర్లలో 7.971 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, జెన్‌కో జలవిద్యుత్ కేంద్రానికి 38,393 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఐదు యూనిట్ల ద్వారా 31.353 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. లోయర్ జూరాలలో కూడా ఆరు యూనిట్ల ద్వారా 34.783 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నట్లు జూరాల అధికారులు తెలిపారు. నెట్టెంపాడు లిఫ్ట్ కెనాల్‌కు 1500 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్ లిఫ్ట్ కెనాల్‌కు 315 క్యూసెక్కులతో మొత్తం 40,275 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

● శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టు విద్యుత్ ఉత్పాదన ద్వారా 38,393 క్యూసెక్కులు వస్తుండగా 28,583 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 885 అడగులకు గాను, 845.10 అడుగులలో 215.807 టీఎంసీలకు గాను 70.3596 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. ఎంజీకేఎల్‌ఐ కాల్వకు 1,030 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కుడి గట్టు విద్యుత్ కేంద్రంలో 176 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి 0.088 మిలియన్ యూనిట్లు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో 7,525 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి 3.441 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. మొత్తంగా 8.870 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉన్నది.

11 యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జూరాల ఎగువ దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో 11 యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ప్రియదర్శిని జూరాల జలాశయానికి ప్రస్తుతం 40 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో ఎగువ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 5 యూనిట్ల ద్వారా 2.828 మిలియన్ యూనిట్లు, దిగువ కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా 3.266 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. వరద ఇదే స్థాయిలో కొనసాగితే నిర్దేశించిన లక్ష్యాన్ని త్వరలోనే చేరుకొనే అవకాశం ఉంటుందని ఎస్‌ఈ తెలిపారు. మూడవ యూనిట్ మరమ్మతు పనులు కూడా వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

విద్యాబోధన సాగేదెలా?

» గిరిజన తండాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలే అధికం
» ఐదు తరగతులున్న బడుల్లోనూ ఒక్కడే ఉపాధ్యాయుడు
» ఆయన రాకపోతే ఆ రోజు బోధనకు సెలవు
» పిల్లలను చేర్పించేందుకు ముందుకు రాని తల్లిదండ్రులు



పేట మండలం వందర్‌గుట్ట తాండలో విద్యార్థులతో ఉపాధ్యాయులు,సిఆర్‌పి రవి



కోత్తపల్లి మంఢలం వాల్యానాయక్‌తాండలో పిల్లలు లేక ప్రభుత్వ పాఠశాల భవనం కాస్తా పంచాయుతీ కార్యాలయుంగా మారిన వేనం

నారాయణపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లాలోని గిరిజన తండాల్లోని ప్రభుత్వ బడుల్లో విద్యాబోధన సక్రమంగా సాగే పరిస్థితి కనిపించడం లేదు. ఎక్కువగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండటమే అందుకు ప్రధాన కారణం. ఐదు తరగతులు ఉన్న బడుల్లోనూ ఒకే ఉపాధ్యాయుడు ఉండటం ప్రధాన సమస్యగా మారింది. ఒక వేళ ఏదైనా సమావేశం ఉండి ఉపాధ్యాయుడు బడికి రాకపోతే ఆ రోజు విద్యాబోధన అటకెక్కినట్లే అవుతోంది. చాలా బడుల్లో ఒకే ఉపాధ్యాయుడు ఉండటంతో 5 తరగతుల విద్యార్థులను ఒకే చోట కూర్చోబెట్టి పాఠాలు బోధించాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో మాత్రమే ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. ఈ పరిస్థితుల్లో అంతో ఇంతో ఆర్థిక స్థోమత ఉన్న వారు తమ పిల్లలను సమీప జిల్లా కేంద్రం, లేదా మండల కేంద్రాల్లోని ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా పెరగడం లేదు. ప్రస్తుతం చాలా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 50కి లోపే ఉంటోంది. గిరిజన తండాల్లోని పాఠశాలలపై ప్రజాప్రతినిధులు, ఉన్న తాధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప పరిస్థితి మారదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఆయా పాఠశాలల్లో వసతులు కల్పించి, ఉపాధ్యాయుల సంఖ్యను పెంచి విద్యాబోధనను మెరుగు పరచాల్సి ఉంది. అప్పుడే ఆయా పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగి, తమ పిల్లలను చేర్పించే అవకాశం ఉంటుంది.

మండలాల పరిధిలోని తండాల్లో..

● దామరగిద్ద మండలంలోని వత్తుగుండ్ల తండా పాఠశాలలో 24 మంది విద్యార్థులకు, ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారు. సద్దబండ తండాలో 20 మంది విద్యార్థులు, ఓక టీచర్ ఉన్నారు. ఒక పోస్టు ఖాళీగా ఉంది. దామరగిద్ద తండా పాఠశాలలో 46 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు ఉన్నారు.

● కోస్గి మండలంలోని పీసీతండా ప్రాథమిక పాఠశాలలో 14 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. గుండుమాల్ మండలంలోని సారంగరావుపల్లి తండాలో ఐదు తరగతుల్లో 18 మంది విద్యార్థులు ఉండగా, ఒకే ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. అప్పాయిపల్లి తండా పాఠశాలది కూడా అదే పరిస్థితి. 12 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారు.

● ధన్వాడ మండలంలోని పది తండా గ్రామ పంచాయతీల్లో పాఠశాలలున్నాయి. అందులో ని ఐదు బడుల్లో ఒకే టీచర్ ఉన్నారు. తిమ్మారెడ్డి కుం ట తండా, మీది కుంట తండాల్లో 5గురు విద్యార్థులే ఉన్నారు. మాడుగుల ముల్లయ్య తండాలోని పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది.

● కొత్తపల్లి మండలంలోని కొత్తపల్లితండా పాఠశాలలో 10 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారు. దుప్పటిగట్టు తండా బడిలో ఒకే టీచర్ ఉండగా, 20 మంది పిల్లలు చదువుకుంటున్నారు. వాల్యానాయక్ తండాలో ఉపాధ్యాయుడు లేకపోవడంతో ఉన్న పది మంది విద్యార్థులు గత ఏడాది భూనేడ్ పాఠశాలకు వెళ్లిపోయారు. దీంతో ఆ బడి మూతపడింది.

● మద్దూరు మండలంలోని ఐదు తండాల్లోని బడుల్లో 10 మందికి లోపే విద్యార్థులున్నారు. హనుమాన్‌నాయక్ తండాలో ఒకే ఒక్క విద్యార్థి ఉన్నాడు. పొర్లకుంట, సాపన్‌చెరువు, పల్లెగడ్డ బీసీ కాలనీ, ఎర్రగోల్, టక్రేతండాల్లోని పాఠశాలల్లో విద్యార్థులే లేరు.

● మరికల్ మండలంలోని గాజులయ్య తండాలో ఐదు తరగతులకు 45 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులున్నారు.

జీ బండ తండాలోని బడిలో 10 మంది పిల్లలు, ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. బుడ్డగాన్‌తండాలో 20 మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుతోంది.

35 తండా గ్రామ పంచాయతీలు

నారాయణపేట జిల్లాలోని 280 గ్రామ పంచాయతీల్లో 35 గిరిజన తండాలు గ్రామ పంచాయతీలుగా కొనసాగుతున్నాయి. నారాయణపేట మండలం బోయిన్‌పల్లి తండాలో 48 మంది విద్యార్థులు ఉండగా, ఒకేఒక్క ఉపాధ్యాయుడు విధుల్లో ఉన్నారు. పేరపళ్లమీది తండాల్లో ఇద్దరు ఉపాధ్యాయులున్నారు కానీ విద్యార్థులు మాత్రం 35 మంది ఉన్నారు. తండాకు చెందిన దాదాపు 20 మంది పిల్లలు నారాయణపేటలోని ఎయిడెడ్ పాఠశాలలో చేరారు. ప్రతీ రోజు ఆటోలో పాఠశాలకు వెళ్లి వస్తుంటారు. పేరపళ్ల కిందితండా బడిలో 5 తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు ఉండగా, 16 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. డ్రైవర్ గోపితండా బడిలో తొమ్మిది మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు పని చేస్తున్నారు. కొల్లంపల్లి కస్టర్ పరిధిలోని పాతతండా పాఠశాలలో ఇద్దరు టీచర్లు, 40 మంది విద్యార్థులున్నారు. మల్యాతండా బడిలో ఒక టీచరు, 10 మంది విద్యార్థులున్నారు. నల్లగుట్టతండా బడిలో 21 మంది విద్యార్థులుండగా, ఒక ఉపాధ్యాయుడు పాఠాలు చెప్తున్నారు. పిల్లిగుండ్ల తండాలోని బడిలో 34 మంది విద్యార్థులు, ఒక టీచరు ఉన్నారు. సిక్రమోని తండా బడిలో 23 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడున్నారు. స్వాముల వారి తండాలో ఒక ఉపాధ్యాయుడు, 21 మంది విద్యార్థులు, వందర్‌గుట్ట తండా బడిలో ఇద్దరు ఉపాధ్యాయులుండగా, 35 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కొత్తపల్లి తండాలో ఇద్దరు ఉపాధ్యాయులు, మేకహనుమాన్‌తండా, ఊటకుండ తండా, ఒండుచెలిమ తండాల్లోని పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారు.

భయోత్పాతం..



ఘనపూర్ ఆసుపత్రి ఆవరణంలో పారబోసిన టానిక్ సిసాలు, మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు

» బయో వ్యర్థాలను మునిసిపల్ ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలింపు
» కాలం చెల్లిన మందులను బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తున్న ఆస్పత్రుల యాజమాన్యం
» వనపర్తి పట్టణంలో 215 క్లినిక్‌లు, ఆసుపత్రులు, ల్యాబ్‌లు

వనపర్తి వైద్యవిభాగం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల నుంచి వెలువడే బయో వ్యర్థాల నుంచి మనుషులకే కాకుండా మూగజీవాలకు సైతం ప్రమాదం పొంచి ఉంది. జనావాలకు దూరంగా తీసుకెళ్లి బర్నింగ్ చేయాల్సిన ఈ బయో వ్యర్థాలను మునిసిపల్ ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. పదేళ్ల క్రితం బయో వ్యర్థాలను తరలించే బాధ్యతను అప్పటి కలెక్టర్ శ్వేతా మహంతి ఓ ప్రైవేటు కంపెనీకి అప్పగించారు. ఈ కంపెనీ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వెలువడే బయో వ్యర్థాలను ఆసుపత్రుల్లోని మంచాల సామర్థ్యం లెక్కన చార్జి వేసి ప్రత్యేక వాహనాల ద్వారా తరలించేవారు. ఈ తరలించిన వ్యర్థాలను ఘణపూర్ వెళ్లే దారిలో సోలీపూర్ గ్రామ శివారులో గల కంపెనీ దగ్గర బర్నింగ్ చేసేవారు. కానీ సమయానికి కంపెనీ వాహనాలు రాకపోవడంతో ఆసుపత్రుల యాజమాన్యం మునిసిపల్ ట్రాక్టర్ డ్రైవర్లకు ఎంతో కొంత డబ్బులు ముట్ట చెబుతూ ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు.

మూగజీవాలకు మేతగా...

మునిసిపల్ ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు చేరుతున్న బయో వ్యర్థాలు మూగజీవాలకు మేతగా మారుతున్నాయి. బయో వ్యర్థాలను, కాలం చెల్లిన మందులను తిన్న మేకలు, గొర్రెలు అనారోగ్యానికి గురవుతున్నాయి. అంతేకాకుండా కాలం చెల్లిన మందులు డంపింగ్ యార్డులో దర్శనమిస్తుండటం, బహిరంగ ప్రదేశాల్లో పారబోయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. గతంలో ప్రభుత్వం పంపిణీ చేయాల్సిన మందులు కుప్పలు కుప్పలుగా డంపింగ్ యార్డులో కనిపించాయి.

ఇటీవల ఘణపూర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కాలం చెల్లిన మందులను బహిరంగ ప్రదేశాల్లో పారబోశారు. విషయం బయటికి తెలియడంతో వెంటనే ఆసుపత్రి సిబ్బంది నిప్పు పెట్టి దహనం చేశారు.

పాటించని నిబంధలు..

జిల్లాలో ఆసుపత్రులు, క్లినిక్‌లు, పాలిక్లినిక్‌లు, మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు, ల్యాబ్‌లు, డెంటల్ క్లినిక్‌లు, కంటి ఆసుపత్రులు, నర్సింగ్ హోంలు, ఆయుర్వేదిక్ ఆసుపత్రులు, చిన్నపిల్లల ఆసుపత్రులు, హోమియోపతి వైద్యశాలలు, ఈఎన్‌టీ ఆసుపత్రులు కలిపి జిల్లా వ్యాప్తంగా 215 కేంద్రాలు ఉన్నాయి. వాటి నుంచి వచ్చిన బయో వ్యర్థాలను నిబంధనల ప్రకారం నలుపు, ఎరుపు, ఆకుపచ్చ కవర్‌లలో వేర్వేరుగా నిల్వ చేసి కంపెనీ వాహనాలకు అప్పగించాల్సి ఉంటుంది. కానీ ఈ నిబంధనలు ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేటు ఆసుపత్రులు కూడా పాటించడం లేదు. అన్ని రకాల వ్యర్థాలను ఒకే కవర్‌లో వేసి చెత్త ట్రాక్టర్‌లకు అప్పగిస్తున్నారు.

కట్టడి చేస్తాం..



బయో వ్యర్థాలు డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్న విషయం ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. వెంటనే జిల్లాలోని వైద్యశాలల నిర్వహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. వ్యర్థాలను తరలించే కంపెనీతో మాట్లాడి ప్రతీ రోజు వాహనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు.

- డాక్టర్ శ్రీనివాసులు, డీఎంఅండ్‌హెచ్‌వో, వనపర్తి.

సంబురంగా సాగు

» ఉమ్మడి జిల్లాలో ఆశాజనకంగా ఖరీఫ్ సీజన్
» పత్తి సాగు వైపే మొగ్గు చూపుతున్నరైతులు



విత్తనాలు నాటేందుకు సిద్ధం చేసిన నేల

(5వ పేజీ తరువాయి..)

నకిలీ విత్తనాలకు సంబంధించిన రెండు కేసులు, నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలంలో 10కిలోల నకిలీ విత్తనాలు పట్టుబడిన సంఘటనలో మరో కేసు, జోగుళాంబ గద్వాల జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలకు సంబంధించి మరో రెండు కేసులు నమోదు కావడం గమనార్హం. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో కూడా గుంటూరుకు చెందిన నకిలీ విత్తనాలు రైతులకు అమ్మిన ఘటనలు బయటకు వచ్చినప్పటికీ విత్తనాలు మొలిచే దాకా వాస్తవ పరిస్థితి బయటకు వచ్చే అవకాశం లేదు.

జూలైలోనే నీటి విడుదల..

కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా జూరాల, ఎగువనున్న ప్రాజెక్టులు దిగువనున్న మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం ద్వారా ఈ సారి జూలై మొదటి వారంలోనే కాల్వల ద్వారా నీటిని విడుదల చేసేందుకు ఇరిగేషన్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జూరాల, సుంకేశుల నుంచి బుధవారం కూడా శ్రీశైలం ప్రాజెక్టుకు దాదాపు 39,443 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం లిఫ్టు నుంచి ఎల్లూరు, సింగవట్నం, జొన్నలబొగుడ రిజర్వాయర్లల్లో నీటిని నిల్వ చేస్తున్నారు. వర్షాలకు సంబంధించి సీజన్ ప్రారంభంలోనే ఆశాజనకమైన పరిస్థితి ఉండడంతో రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు. వరి పండించే రైతులు మాత్రం సన్నరకానికి ప్రాధాన్యత నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రూ.500 బోనస్‌ను ప్రకటించడంతో ఈ సారి పత్తి తర్వాత సన్నరకం వరి రెండో ప్రాధాన్యత పంటగా నిలవనుంది.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

» ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి



విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, కలెక్టర్

నారాయణపేటటౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. పీఆర్టీయు టీఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రతిభ అవార్డుల ప్రదానోత్సవానికి జిల్లా అధ్యక్షుడు వై. జనార్దన్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీతో పాటు కలెక్టర్ సిక్తా పట్నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, డీఈవో గోవిందరాజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన స్థాయిలను పెంచి గుణాత్మక విద్యను అందించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎల్ల వేళలా కృషి చేస్తామన్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. బడిబాట కార్యక్రమాన్ని చక్కగా నిర్వహిస్తున్నారని అభినందించారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రణాళికాబద్ధంగా విద్యార్థులను సిద్ధం చేసి విజయవంతం అయ్యారని చెప్పారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, నాయకులు రఘువీర్, సత్యనారాయణ, శ్రీనివాస్, ఎం.జనార్దన్ పాల్గొన్నారు.

రైతులకు బేడీలు వేస్తారా?

» అక్రమ కేసులను ఎత్తివేయాలి
» ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలి
» మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్



మహబూబ్‌నగర్ జైలు నుంచి విడుదలైన రాజోలి మండలం పెద్ద ధన్వాడ రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన చేసిన రైతులపై అక్రమ కేసులు బనాయించి దొంగలు, బందిపోట్ల మాదిరి బేడీలు వేస్తారా? అని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలంలోని పెద్ద ధన్వాడకు చెందిన 12 మంది రైతులు జిల్లా కేంద్రంలోని జైలు నుంచి విడుదలయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వారిని పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో అలంపూర్ ప్రాంతంలో తుమ్మిళ్ల ప్రాజెక్టును నిర్మించి రైతులకు భూములు కొనిచ్చామని గుర్తు చేశారు. ఆ ప్రాంతానికి కర్నూలు, రాయిచూరుల నుంచి ప్రజలు వలసలు వచ్చేలా చేశామన్నారు. కానీ ఈ ప్రభుత్వం ఆ భూములను నాశనం చేసే పరిశ్రమలను తీసుకొస్తోందని విమర్శించారు. ఇథనాల్ పరిశ్రమను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విధుల్లో ఉన్న నాగర్‌కర్నూల్ జైలర్ ఈ ఊరికి చెందిన వ్యక్తి కావడంతో అతడిపైనా కేసు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తెలంగాణ పోరాటాల గడ్డ అని, ఇలాంటి కేసులకు భయపడదన్నారు. నడిగడ్డ బిడ్డలు అసలు భయపడరని, రైతులకు అందరూ అండగా ఉంటారని చెప్పారు. ఇథనాల్ పరిశ్రమను రద్దు చేసి, రైతులపై కేసులను ఎత్తివేసేవరకు బీఆర్‌ఎస్ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తుందన్నారు. ప్రభుత్వం, అధికారుల తీరు ఇదే మాదిరిగా ఉంటే ఆ 12 గ్రామాలకు 1200 గ్రామాలు అండగా వచ్చి పోరాటం చేస్తాయని పేర్కొన్నారు. ఆయన వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ కేసీ నరసింహులు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజు, నాయకులు నవకాంత్, పాల సతీశ్ ఉన్నారు.

దిగివచ్చిన కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం

» 436కి గాను 289 సంచుల వెలికితీత
» దొరకని మరో 147 సంచులు
» వెతికి అప్పగిస్తామన్న మేనేజర్

అలంపూరు చౌరస్తా, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మిర్చి వ్యాపారికి టోకరా పెట్టేందుకు యత్నించిన మెగా కోల్డ్‌స్టోరేజీ యజమాన్యం ఎట్టకేలకు దిగివచ్చింది. బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మురళి మంగళవారం గోదాంను తనిఖీ చేసి, మిర్చి బస్తాలను గుర్తించారు. వాటిని బుధవారం వ్యాపారికి అప్పగిస్తామని చెప్పిన మేనేజర్ లక్ష్మీకాంతరెడ్డి మాట మార్చాడు. యజమాని వచ్చాక ఇస్తామని వ్యాపారికి చెప్పడంతో ఆయన మళ్లీ కోదండాపురం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఎస్‌ఐ మురళి సెలవులో ఉండటంతో, సీఐ రవిబాబును కలిసి విషయాన్ని తెలిపాడు. దీంతో ఆయన మొత్తం 436 బస్తాలను వ్యాపారికి అప్పగించాలని మేనేజర్‌ను ఆదేశించాడు.

దీంతో మధ్యాహ్నం తర్వాత 289 బస్తాలను బయటకు తీసుకొచ్చారు. మరో 147 బస్తాల ఆచూకీ దొరకలేదు. వాటిని గురువారం వెతికి అప్పగిస్తామని మేనేజర్ చెప్పినట్లు బాధితుడు తెలిపారు. ఈ అంశాన్ని వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'కి దన్యవాదాలు తెలిపాడు.

క్రైం కార్నర్

విద్యుత్‌షాక్‌తో స్తంభంపైనే వ్యక్తి మృతి



శేఖర్ (ఫైల్)

ఉప్పునుంతల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతులు చేస్తూ ప్రమాదవశాత్తు షాక్‌కు గురైన దినసరి కూలీ స్తంభంపైనే మృతి చెందిన సంఘటన బుధవారం నాగర్‌కర్నూలు జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని కంసానిపల్లి గ్రామంలో గల రైతు వేదిక సమీపంలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పునుంతల గ్రామానికి చెందిన మధునాగుల శేఖర్(28)ను విద్యుత్ మరమ్మతుల కోసం లైన్‌మన్ వెంకటేశ్ దినసరి కూలీగా తీసుకెళ్లాడు. విద్యుత్ సరఫరా నిలిపివేసి కంసానిపల్లి ఫీడర్ లైన్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో మరమ్మతులు చేస్తున్న మధునాగుల శేఖర్ విద్యుత్ షాక్‌తో స్తంభంపైనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు, సీపీఎం, బీజేపీ నాయకులు మృతుని కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సబ్ స్టేషన్ ముందు గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. విద్యుత్ ఇన్‌చార్జి ఏడీ ఆంజనేయులు, ఏఈ కొండల్‌తో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు చర్చలు జరిపి ఆర్థిక సహాయం చేసేందుకు ఒప్పందం చేసుకొని ఆందోళన విరమించారు. అనంతరం విద్యుత్ స్తంభంపై ఉన్న మృతదేహాన్ని కిందకు దించి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.

మహిళపై హత్యాచారం

పెద్దమందడి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా పెద్దమందడి మండల పరిధిలోని ఓ గ్రామంలో మంగళవారం రాత్రి ఓ 45 ఏళ్ల మహిళపై అత్యాచారం, హత్య జరిగింది. మంగళవారం రాత్రి ఇంటికి వచ్చిన కుర్మూర్తి అనే వ్యక్తి తన తల్లిని తీసుకెళ్లి ఓ ఇంటి వరండాలో అత్యాచారం చేశాడని, తాగిన మైకంలో ఆమె తలను బలంగా గోడకు బాధడంతో రక్తపు గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు మృతురాలి కూతురు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివకుమార్‌యాదవ్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ రాంబాబు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ పరిశీలించి వివరాలు సేకరించారు.

కుటుంబ కలహాలతో..
వివాహిత ఆత్మహత్య

భూత్పూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన భర్తతో గొడవ పడి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నది. భూత్పూర్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని కొర్లవంపు తండాకు చెందిన వత్యావత్ రవినాయక్, భార్య బుజ్జిబాయి (38)లు మేస్త్రీ, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల మద్యానికి బానిసైన రవినాయక్ తరుచూ భార్యతో గొడవ పడుతున్నాడు. ఎంత చెప్పినా భర్తలో మార్పు రాకపోవడంతో బుజ్జిబాయి కొద్ది రోజుల క్రితం తల్లి గారి గ్రామం అయిన అడ్డాకుల మండలంలోని తిమ్మాయిపల్లి తండాకు వెళ్లిపోయింది. అక్కడ గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టించారు. వారు బుజ్జిబాయిని సముదాయించి అత్తగారి ఊరైన కొర్లవంపుకు పంపించారు. ఆ తర్వాత భార్యభర్తలు ఇద్దరూ బాగానే ఉన్నారు. కానీ బుధవారం ఉదయం రవినాయక్ మళ్లీ మద్యం తాగి వచ్చి భార్యతో మరోమారు గొడవ పడ్డాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బుజ్జిబాయి ఇంట్లోకి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. సమాచారం అందుకున్న భూత్పూర్ ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి హర్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తమ్ముడిపై అన్న దాడి

నవాబ్‌పేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పొలం, ప్లాటు విషయంలో తమ్ముడిపై అన్న దాడి చేశాడు. సంఘటనకు సంబంధించి నవాబ్‌పేట ఎస్ఐ విక్రం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని దయాపంతులపల్లి గ్రామానికి చెందిన యాదయ్య, బాలరాజు అన్నదమ్ములు. యన్మనగండ్ల శివారులోని సర్వే నెంబర్ 575లో ఉన్న వారి 3 ఎకరాల పొలాన్ని కొంత కాలం క్రితం రూ. 3 లక్షలు ఖర్చు చేసి చదును చేయించారు. అందులో అన్న యాదయ్య రూ. 50 వేలు మాత్రమే ఇచ్చాడు. మిగతా డబ్బుల కింద తన ప్లాట్ తీసుకోవాలని కోరాడు. అందుకు అంగీకరించిన తమ్ముడు బాలరాజు, ఆ ప్లాట్‌లో ఇటీవల ఇంటి నిర్మాణం ప్రారంభించాడు. ఈ విషయంపై బుధవారం వారిద్దరి మధ్య జరిగిన గొడవలో అన్న మరికొందరితో కలిసి తమ్ముడిపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మూగ జీవాలపై ప్రయోగాలు

- ఫిర్యాదు చేసిన స్వచ్ఛంద సంస్థ పెటా ఇండియా
- పాలమూరు బయోసైన్స్ కంపెనీపై కేసు

భూత్పూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నయమ నిబంధనలను పాటించకుండా మూగ జీవులపై ప్రయోగాలు చేస్తున్నారనంటూ ఓ పరిశ్రమపై జంతు ప్రేమికులు ఫిర్యాదు చేశారు. సంఘటనపై భూత్పూర్ ఎస్ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని కర్వెన, మద్దిగట్ల గ్రామాల శివారులో పాలమూరు బయోసైన్స్ ప్రైవేట్ కంపెనీ ఉంది. అందులో నిబంధనలకు విరుద్ధంగా కోతులు, కుక్కలు, పందులపై ప్రయోగాలు చేసి, చంపేస్తున్నారంటూ ఢిల్లీకి చెందిన స్వచ్ఛంద సంస్థ పెటా ఇండియా అడ్వైజర్ అంజనాఅగర్వాల్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందుకు సంబంధించిన ఆధారాలు పరిశ్రమలోని సీసీ ఫుటేజీల్లో ఉన్నాయని ఆమె తెలిపారు. జంతు హింస ప్రకారం పరిశ్రమ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కౌజు పిట్ట... లాభాల పుట్ట



ఊర్కొండ షెడ్‌లో పెంచుతున్న కౌజు పిట్టలు

- పెంపకంపై యువకుల ఆసక్తి
- మాంసానికి మంచి డిమాండ్
- 30 రోజుల్లోనే 160 గ్రాములు
- రూ. 40 - రూ. 50 వరకు విక్రయం

ఊర్కొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : కౌజు పిట్టల పెంపకంతో యువకులు లాభాలు ఆర్జిస్తున్నారు. ఖర్చు, శ్రమ రెండూ తక్కువే కావడం, లాభాలు కూడా అధికం కావడంతో ఎక్కువ మంది వీటి పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా వీటి మాంసంలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని, కోడి మాంసం కంటే రుచిగా కూడా ఉంటుందని వారు చెప్తున్నారు.

ఫామ్‌ల నిర్వహణతో జీవనోపాధి

నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఊర్కొండ, రేవల్లి, గుండ్లగుంటపల్లి గ్రామాల శివారుల్లో కొందరు యువకులు కౌజు పిట్టల ఫామ్‌లు నిర్వహిస్తున్నారు. వారిలో గుండ్లగుంటపల్లికి చెందిన కర్నాటి రామన్‌గౌడ్ ఒకరు. ఆయన 20 సంవత్సరాల నుంచి ఫామ్ నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఆసక్తి ఉన్న వారికి శిక్షణ కూడా ఇస్తున్నారు. దాంతో పాటు కౌజు పిట్టల గుడ్లను పొదిగి, వచ్చిన పిల్లలను రూ. 10 చొప్పున ఇతర ఫామ్‌లకు విక్రయిస్తున్నారు. ఈ పిట్టలు 30 రోజుల్లోనే 160 గ్రాముల వరకు బరువు పెరిగి విక్రయానికి సిద్ధం అవుతాయి. వాటిని స్థానికంగా రూ.40 - రూ. 50 వరకు విక్రయిస్తున్నారు. చాలా వరకు హైదరాబాద్ లోని ముర్గిచౌక్, మాదాపూర్, రాజేంద్రనగర్, అత్తాపూర్‌ల కు తరలించి అమ్ముకుంటున్నారు. అక్కడ ఒక పిట్టకు రూ.65 - రూ. 70 విక్రయిస్తున్నారు. ఊర్కొండకు చెందిన గువ్వ ప్రశాంత్ 8 సంవత్సరాలుగా కౌజు పిట్టల ఫామ్ నిర్వహిస్తున్నారు. రేవల్లిలో కూడా రమేశ్ అనే వ్యక్తి ఓ ఫామ్ ఏర్పాటు చేస్తున్నారు. జిల్లెల్ల గ్రామం లోనూ కొందరు కౌజు పిట్టలను పెంచుతున్నారు. లాభాలు ఎక్కువగా వస్తున్నట్లు తెలియడంతో మరి కొందరు యువకులు కూడా ఫామ్‌లు ఏర్పాటు చేసేందుకు సిద్ధం అవుతున్నారు.



గుండ్లగుంటపల్లి శివారులోని ఫామ్‌లో గుడ్లను పొదిగే యంత్రాలు

మరో నలుగురికి ఉపాధి



ఉన్నత విద్యను అభ్యసించినా ఉద్యోగం రాకపోవడంతో స్వయం ఉపాధి కోసం 8 ఏళ్ల క్రితం కౌజు పిట్టల పెంపకాన్ని ప్రారంభించాను. ప్రతీ నెల 5 వేల పిట్టల వరకు హైదరాబాద్‌కు తరలించి విక్రయిస్తున్నాను. నేను జీవనోపాధి పొందడంతో పాటు, మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నాను. తక్కువ ఖర్చు, శ్రమతో ఎక్కువ లాభాలు వస్తున్నాయి.

\- గువ్వ ప్రశాంత్, ఎంఏ, ఊర్కొండ

వ్యవసాయానికి తోడుగా...



వ్యవసాయం చేయడంతో పాటు కౌజు పిట్టలను పెంచుతున్నాను. గతంలో ఇంట్లోనే పెంచేవాడిని. గ్రామంలో ఇబ్బందులు రావడంతో మా పొలంలో ఫామ్ ఏర్పాటు చేశాను. 20 ఏళ్లుగా ఫామ్ నిర్వహిస్తున్నాను. ప్రతీ నెల 15 వేల పిట్టలను విక్రయిస్తున్నాను. దీంతో పాటు గుడ్లను పొదిగే యంత్రాలను కూడా కొనుగోలు చేశాను గుడ్లను పొదిగి పిల్లలను కూడా ఇతర ఫామ్‌లకు అమ్ముతున్నాను. అలాగే వాటికి కావలసిన దాణాను కూడా సరఫరా చేస్తున్నాను. నా ఫామ్‌లో 10 మందికిపైగా పని వారున్నారు.

\- కర్నాటి రామన్‌గౌడ్, గుండ్లగుంటపల్లి

పీయూకి పీసీఐ గుర్తింపు

- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలోని ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలకు పీసీఐ (ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) గుర్తింపు లభించిందని వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 విద్యాసంవత్సరానికి గాను బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ కోర్సులకు అనుమతి లభించిందన్నారు. ప్రతీ సంవత్సరం ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇక్కడ సౌకర్యాలను పరిశీలించి గుర్తింపు ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ రవికాంత్, అధికారులు పాల్గొన్నారు.

26న స్పోర్ట్స్ స్కూళ్లకు విద్యార్థుల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో ఈ నెల 26న జిల్లా స్పోర్ట్స్ స్కూల్లో విద్యార్థుల ప్రవేశానికి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో విద్యార్థుల ప్రవేశానికి జిల్లా స్థాయి ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. 8 నుంచి 9 సంవత్సరాల వయస్సు ఉండి, 2016, సెప్టెంబర్ 1 నుంచి 2017, ఆగస్టు 31 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్, 3వ తరగతి బోనఫైడ్, ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫొటోలతో పోటీలకు హాజరు కావాలని సూచించారు. ఉదయం 8:00 గంటలకు స్టేడియానికి చేరుకోవాలని కోరారు.

నల్లమలలో ట్రైనీ ఐఏఎస్‌లు

- పర్హాబాద్ వ్యూపాయింట్ సందర్శన
- వటవర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతల బైలు పరిశీలన
- అభయారణ్యంలో అభివృద్ధి పనులపై అధ్యయనం



మన్ననూరు పర్యావరణ మ్యూజియం వద్ద అటవీ అధికారులతో శిక్షణ ఐఏఎస్ లు

మన్ననూర్/ దోమలపెంట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే రెండో అతి పెద్దదైన అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతాన్ని ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం బుధవారం పర్యటించింది. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఐఏఎస్ - 2024 బ్యాచ్ అధికారులు శిక్షణ పొందుతున్నారు. తెలంగాణ దర్శన్‌లో భాగంగా వారిలో సౌరబ్ శర్మ, సలోని చబ్రా, హర్ష్ చౌదరి, కరోలియన్ చింగ్‌తిఅన్మవి, కొయ్యడ ప్రణయ్ కుమార్‌లు నల్లమల ప్రాంతంలో క్షేత్ర స్థాయి పర్యటనకు వచ్చారు. డీఎఫ్‌వో రోహిత్ గోపిడి నేతృత్వంలో వారికి మన్ననూరు వనమాలిక వద్ద అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఇకో టూరిజంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైగర్ సఫారీ, కాటేజీలు, జ్యూట్ బ్యాగుల తయారీ కేంద్రం, బయోల్యాబ్‌లను పరిశీలించారు. నల్లమల ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధానికి తీసుకుంటున్న చర్యలను అటవీ శాఖ అధికారులు వారికి వివరించారు. పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో అమ్రాబాద్ పులుల అభయారణ్య స్వరూపం, వన్యప్రాణులు, అడవిలో నివసించే చెంచుల పూరిళ్లు, వారి జీవన విధానాన్ని తెలిపే చిత్ర ప్రదర్శనను తిలకించారు. అమ్రాబాద్ పులుల అభయారణ్య విశేషాలను డిజిటల్ తెరపై చూశారు. అనంతరం సఫారీ వాహనాల్లో పర్హాబాద్ వ్యూపాయింట్‌కు వెళ్లి కొద్దిసేపు గడిపారు. ఆ తర్వాత పునరావాస ప్యాకేజీ అమలు చేస్తున్న వటవర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబైలు గ్రామాలను పరిశీలించారు.

స్థానికులు, అధికారులతో మాట్లాడి అటవీశాఖ తరఫున కల్పించనున్న వసతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణలో భాగంగా రెండు రోజుల పాటు నల్లమలలో పర్యటించనున్నట్లు తెలిపారు. ఒక్కడి ప్రజల జీవన విధానం, ఉపాధి అవకాశాలు, నల్లమల అడవుల అభివృద్ధి, పునరావాస గ్రామాల తరలింపు ప్రక్రియ, వారికి కల్పించే వసతులను తెలుసుకొని ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని గ్రామస్థులకు తెలిపారు. అక్కడి నుంచి ఆక్టోపస్ వ్యూపాయింట్, శ్రీశైలం డ్యామ్‌లను సందర్శించి, రాత్రికి శ్రీశైలం క్షేత్రానికి చేరుకోనున్నారు.

రెండవ రోజు పర్యటన సాగేదిలా..

జిల్లా పర్యటనలో భాగంగా రెండవ రోజు గురువారం ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాన్ని పరిశీలించనున్నారు. అక్కడి నుంచి సోమశిల పర్యాటక ప్రాంతానికి చేరుకుంటారు. ఆ తర్వాత నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకోనున్నారు. అధికారుల విధులు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలను పరిశీలించనున్నట్లు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో అటవీ రేంజ్ అధికారి వీరేశం, బయాలజిస్టు మహేందర్, సెక్షన్ అధికారి శ్రీకాంత్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, ఎఫ్ఎస్‌వోలు ధర్మనాయక్, రామాంజనేయులు, బీట్ ఆఫీసర్లు మధుసూదన్, తేజీశ్రీ, శిల్ప, పునరావాస గ్రామ కమిటీ సభ్యులు, కరీం, మల్లేశ్, జగదీశ్, ఫయిముల్లా షరీఫ్, రాములు పాల్గొన్నారు.

బురదమయమైన రోడ్డు

- నాట్లు వేసి గోదల్ చింతల్ బస్తీ వాసుల ఆందోళన



గోదల్ గ్రామంలో చింతల్ బస్తీ కాలనీలో వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

బల్మూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : చిన్న వర్షం పడినా రోడ్లపై నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది కలుతుండటంతో స్థానికులు ఆందోళనకు దిగారు. రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా, బల్మూరు మండల పరిధిలోని గోదల్ గ్రామంలోని చింతల్‌బస్తీలో రోడ్డు అధ్వానంగా మారింది. చిన్న వర్షం పడినా నీరు నిలిచి బురదమయంగా మారుతోంది. దీంతో స్థానికులు రోడ్డుపై నిల్వ ఉన్న నీటిలో బుధవారం వరి నాట్లు వేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపై నీరు నిలవడంతో చిన్న పిల్లలు, వృద్ధులు బస్టాప్‌కు వెళ్లేందుకు ఇబ్బంది అవుతోందని తెలిపారు. ఈగలు, దోమల బెడద ఎక్కువై వ్యాధుల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. డ్రైనేజీ నిర్మించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

చింతలమ్మ చెరువులో అరుదైన చేప

- మత్స్యకారుల చేతికి చిక్కిన 12 కిలోల వాలుగ



కడుకుంట్ల చింతలమ్మ చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు

వనపర్తి రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, మండల పరిధిలోని కడుకుంట్ల గ్రామ సమీపంలోని చింతలమ్మ చెరువులో బుధవారం అరుదైన 12 కిలోల వాలుగ చేప లభ్యమయ్యింది. అదే గ్రామానికి చెందిన మత్స్యకారులు చెరువులో చేపలు పడుతుండగా బొచ్చలు, బంగారు తీగలు, రవటలు, లాడెలతో పాటు వాలుగ చేప లభ్యమైంది. చేపలు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారు దాన్ని చూసి ఆశ్చర్యపోయారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి చేప వలలో పడలేదని మత్స్యకారులు మన్యం, వెంకటేష్, వెంకటయ్య, శివయ్య, శ్రీనివాసులు, ఎల్లయ్య, మనీశ్ నాగన్న, రవి, రాజు తెలిపారు. చేపను కొంటామని కొందరు అడిగినా వారు అంగీకరించలేదు. తామే తీసుకుంటామని చెప్పి తీసుకెళ్లారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

- 21వ తేదీ వరకు రోజుకో కార్యక్రమం
- 16 మండలాల్లోని 423 గ్రామాల్లో నిర్వహణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. సమస్యను గుర్తించిన కలెక్టర్ విజయేందిర బోయి జిల్లాలోని 16 మండలాల్లో ఉన్న 423 గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. అందులో భాగంగా అన్ని మండలాల ఎంపీవోలు గ్రామాల్లో మంగళవారం నుంచి పనులు చేపట్టారు. తొలి రోజు అనుబంధ పల్లెల్లో వీధులను శుభ్రం చేసి, పిచ్చి మొక్కలను తొలగించారు. గ్రామాల్లో ముళ్లకంపలను కొట్టేసి, రోడపై చెత్తను శుభ్రం చేశారు.

రహదారులపై గుంతలను పూడ్చి చదును చేశారు. బుధవారం మురికి కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డులకు తరలించారు. ప్లాస్టిక్, జ్యూట్ తదితరాలను రీసైకిలింగ్ కోసం సెగ్రిగేషన్ షెడ్లకు పంపించారు.



పెద్దదర్పల్లి గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న సిబ్బంది

నేటి నుంచి చేపట్టనున్న కార్యక్రమాలు

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 19న గురువారం అన్ని గ్రామాల్లోని మురికి కాలువలు, నీరు నిల్వ ఉన్న గుంతల్లో దోమలు వ్యాప్తి చెందకుండా మస్కిటో అయిల్ బాల్స్ వేయనున్నారు. మురుగునీటిలో దోమలు గుడ్లు పెట్టకుండా యాంటి లార్వా మందులను స్ప్రే చేయనున్నారు. అయిల్ బాల్స్‌తో పాటు దోమల నివారణకు ఫాగింగ్ చేయనున్నారు.

20న శుక్రవారం గ్రామ పంచాయతీల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులు, జీఎల్ఎస్ఆర్ ట్యాంకులను శుభ్రం చేయనున్నారు. పైప్‌లైన్ లీకేజీలు ఎక్కడైనా ఉంటే వాటిని సరిచేయనున్నారు. ఇంటింటికీ సరఫరా చేసే తాగునీటిని శుద్ధి చేసి చేసి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోనున్నారు. 21న శనివారం గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలను శుభ్రం చేయనున్నారు. అయితే పారిశుధ్య ప్రత్యేక కార్యక్రమానికి ప్రభుత్వం ఎలాంటి నిధులనూ విడుదల చేయలేదు. అందుబాటులో ఉన్న నిధులతోనే కార్యక్రమాన్ని కొనసాగించాలని ఆదేశించినట్లు తెలుస్తోంది.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు



కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నాం. గ్రాంట్స్ విడుదలయ్యే వరకు స్థానికంగా అందుబాటులో వనరులను వినియోగించుకోవాలని ఆదేశించాం. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీలను భాగస్వామ్యం చేయాలని సూచించాం. డైలీ శానిటేషన్ రిపోర్టు (డీఎస్ఆర్) యాప్‌లో కార్యదర్శులు ఫెస్ రికగ్నైజ్ అంటెండెన్స్ 100 శాతం అప్‌లోడ్ చేస్తున్నారు.

\- పార్థసారథి, డీపీవో

ఇందిరమ్మ కమిటీల భాగస్వామ్యం

గ్రామ పంచాయతీల్లో నిధులు లేని విషయాన్ని కార్యదర్శులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇందిరమ్మ కమిటీల భాగస్వామ్యంతో స్పెషల్ డ్రైవ్‌ను కొనసాగించాలని వారు ఆదేశించారు.

అవసరం మేరకు బ్లీచింగ్ పౌడర్, కిమో ఫిన్, బయోటెక్స్ టెనిఫాస్, హ్యాండ్ పంపులను కమిటీల ఆధ్వర్యంలో కొనుగోలు చేయాలని సూచించారు. గ్రాంట్స్ విడుదలైన తర్వాత వారికి బిల్లులు చెల్లించాలని ఆదేశించారు.

ఇంటర్వ్యూ

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావు



జడ్చర్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి రెవెన్యూ సదస్సులని జడ్చర్ల మండల తహసీల్దార్ నర్సింగ్‌రావు తెలిపారు. రెవెన్యూ సదస్సులలో తమ సమస్యలతో కూడిన ఫిర్యాదులు రైతులు అందిస్తున్నారని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వివరించారు.

భూ భారతి రెవెన్యూ సదస్సులు ఎక్కడెక్కడ నిర్వహిస్తున్నారు?

భూ భారతి రెవెన్యూ సదస్సులను జడ్చర్ల మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో నిర్వహిస్తున్నాం. ప్రతి రోజు రెండు బృందాలతో గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు సదస్సు నిర్వహిస్తున్నాం.

ఏఏ అంశాలపై రైతులు దరఖాస్తులు చేసుకుంటున్నారు?

రెవెన్యూ సదస్సుల్లో భూముల విరాసత్ అంశంపై దరఖాస్తులు అధికంగా వస్తున్నాయి. విస్తీర్ణం హెచ్చుతగ్గులపై సర్వే చేయాలని, అలాగే భూమల సర్వే కోసం దరఖాస్తులు చేస్తున్నారు. వీటితో పాటు సాదాబైనామాతో కొన్ని భూములకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు అత్యధికంగా పోలేపల్లిలో 115 దరఖాస్తులు, వల్లూరు, ఆలూరులలో నిర్వహించిన సదస్సులలో 50కి పైగా దరఖాస్తులు వచ్చాయి.

ఎక్స్‌టెంట్ సమస్యలపై సైతం దరఖాస్తులు వస్తున్నాయా?

ఎక్స్‌టెంట్ సమస్యలపై సైతం దరఖాస్తులు వస్తున్నాయి. తక్కువ ఎక్స్‌టెంట్‌తో పట్టా పాసుపుస్తకాలు జారీ అయ్యాయని, పూర్తి భూమితో పట్టా పాసుపుస్తకాలు జారీ చేయాలంటూ దరఖాస్తులు వస్తున్నాయి. డిజిటల్ సంతకం కాలేదని, డిజిటల్ సంతకంతో కూడిన పాసుపుస్తకం ఇవ్వాలన్న దరఖాస్తులు వచ్చాయి.

పరిహారం రాలేదంటూ ఏమైన ఫిర్యాదులు వచ్చాయా?

పోలేపల్లి సమీపంలో టీఎస్‌ఐఐసీ కోసం సేకరించిన వాటితో పాటు, ఉదండాపూర్ రిజర్వాయర్ కోసం సేకరించినవి, రిజర్వాయర్ నిర్వాసితుల పునరావాసం కోసం సేకరించిన భూములకు పరిహారం రాలేదంటూ కొందరు రైతులు దరఖాస్తులు ఇచ్చారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండానే ప్రాజెక్టుకు భూమి తీసుకునాన్నరని పరిహారం రాలేదంటూ మరికొన్ని దరఖాస్తులు వచ్చాయి.

న్యూస్ బాక్స్

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

బాలానగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాతృమూర్తి, మాజీ సర్పంచ్ శశికళ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కేతిరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేశారు.

తెలంగాణ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా వాసు



వాసును సన్మానిస్తున్న నాయకులు

హన్వాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎమ్మార్పీ ఎస్ జిల్లా అధ్యక్షు డిగా ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన వాసును ఎన్నిక చేశారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బాల్ రాజ్ కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్య దర్శిగా కుర్మయ్యతో పాటు ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ మాదిగా జాతి అభివృద్ధి కోసం, సమస్యల పరిష్కారానికి నిరంతరం పని చేయాలని అన్నారు. అనంతరం మండల కమిటీని కూడా కూడా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వేపూరి రాములు ,ప్రధాన కార్యదర్శిగా అంజనేయు లు, ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు. జిల్లా నాయకులు కేశవులు, నాయకులు కాశన్న తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

గండీడ్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యంగా జీవించవచ్చని గండీడ్ యూనాని వైద్యురాలు శిల్పా అన్నారు. బుధవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి గిరిజన మినీ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దశాబ్ధి ఉత్సవాల్లో భాగంగా యోగా ప్రారంభించారు. యోగా ట్రైనర్ మైపాల్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ రాగిని, ఏఎన్ఎం, నర్సులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ మృతి



కమలమ్మ(ఫైల్)

భూత్పూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి); భూత్పూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ సత్తూరు కమలమ్మ (90) బుధవారం సాయంత్రం మృతి చెందింది. ఈమెకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మొదటి కుమారుడు కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగిగా రిటైర్ అయ్యారు. రెండవ కుమారుడు సత్తూరు బస్వరాజుగౌడ్ మునిసిపల్ చైర్మన్‌గా పనిచేశారు. మూడవ కుమారుడు లింగం గౌడ్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఆమె మృతి వార్త విని వివిధ పార్టీల నాయకులు కమలమ్మ ఇంటికి వెళ్లి పరామర్శించారు.



వర్షం వస్తే ఇక్కట్లే

- దుకాణాలను మూసేస్తున్న వ్యాపారులు
- సమస్యకు పరిష్కారం ఎప్పుడు?

● జడ్చర్లలో జలమయంగా మారుతున్న రోడ్లు

జడ్చర్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : వర్షం పడితే సంబురపడే వాళ్లే ఉంటారు... కానీ జడ్చర్ల మునిసిపాలిటీలో అందుకు భిన్నంగా ఉంటుంది. వర్షం పడితే ప్రధాన రహదారులన్నీ మినీ రిజర్వాయర్‌లుగా మారుతున్నాయి. దుకాణాల్లోకి వర్షం నీరు వస్తుండటంతో దుకాణాలను బంద్ చేసుకుంటున్నారు.

వర్షం నీరు నిలుస్తుండటంతో ఆ రహదారులగుండా వాహనాల రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని ప్రధాన రహదారులైన నేతాజీ చౌక్ నుంచి సిగ్నల్‌గడ్డ వెళ్లే దారిలోని వెంకటరమణ టాకీస్ సమీపంలో, శ్రీనివాస టాకీస్ సమీపంలోని శ్రీకృష్ణమందిరం ముందు, వేంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలోని ప్రధాన ర హదారులపై వర్షం నీరు నిలిచి, చిన్నపాటి జ లాశయాన్ని తలపిస్తాయి. ఆ రోడ్లలో దాదాపు 2 నుంచి 3 ఫీట్ల మేర నీళ్లు నిలుస్తుండటంతో ఆ దారిగుండా ప్రయాణించే వారు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన రహదారులపై వర్షం నీరు నిలువకుం డా చర్యలు చేపట్టాలని, అవసమైన ప్రాంతాల్లో డ్రైనేజీలను నిర్మించాలని పట్టణ ప్రజలు కోరు తున్నారు.

రూ.14కోట్లు మంజూరయ్యాయి..



జడ్చర్ల మునిసిపాలిటీలో వర్షం నీటి ప్రవాహాన్ని అరికట్టేందుకు డ్రైనేజీ నిర్మాణానికి రూ.14కోట్లు మంజూరయ్యాయి. టెండర్‌లు పూర్తయ్యాయి. వారం రోజుల్లో టెండర్‌లు ఓపెన్ కానున్నాయి. అతి త్వరలో పనులు ప్రారంభం అవుతాయి. మునిసిపాలిటీలో వర్షం నీళ్లు రోడ్లపై నిల్వకుండా చర్యలు చేపడ్తున్నాం.

- జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే

రోడ్డుపై నీళ్లు నిలవకుండా చర్యలు చేపట్టాలి



ప్రధాన రహదారిపై వర్షం నీళ్లు నిలుస్తుండటంతో దుకాణాలలోకి వస్తున్నాయి. సుమారు 3 ఫీట్ల మేర నీళ్లు నిలిచిపోతున్నాయి. దుకాణం ముందు పార్కింగ్ చేసుకున్న వాహనాలు సైతం నీళ్లలో మునిగిపోతున్నాయి. దుకాణాలలోకి నీళ్లు రావడంతో దుకాణంలో ఉన్న వస్తువులు పాడవుతున్నాయి. నీళ్లు నిలవకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

- రవి, మొబైల్ దుకాణం యజమాని

సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



ప్రధాన రహదారిపై వర్షం నీళ్లు చిన్న పాటి జలాశయం మాదిరిగా నిలుస్తున్నాయి. ఈ సమస్య గడిచిన నాలుగు, ఐదు సంవత్సరాల నుంచి మొదలయ్యింది. సమస్య ఉత్పన్నమౌవుతున్న మూలాన్ని గుర్తించండి. పాతబజారు నుంచి గౌడ ఫంక్షన్‌హాల్, నల్లకుంట మీదుగా, నేతాజీచౌరస్తా నుంచి సిగ్నల్‌గడ్డకు వెళ్లే ప్రధాన రహదారిపైకి నీళ్లు వరదలా వస్తున్నాయి. నీళ్లు నిల్వకుండా శాశ్వత పరిష్కారం చూపాలి.

- గౌస్, స్టార్‌టైలర్

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- రెవెన్యూ సదస్సును తనిఖీ చేసిన కలెక్టర్ విజయేందిర బోయి

దేవరకద్ర, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూభారతి 2025 చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిరబోయి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పాత ఎంపీడీవో కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన 2025 భూచట్టం భూభారతి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ తనిఖీ చేసి మాట్లాడారు. భూములకు సంబంధించిన ఎలాంటి అభ్యంతరాలు, సమస్యలున్నా అధికారుల దృష్టికి తీసుకొస్తే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రైతుల భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులును తీసుకొని, క్రేత్ర స్థాయిలో విచారించి నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ కృష్ణయ్య డీటీ దీపిక, ఆర్ఐ శరత్‌కుమార్ సిబ్బంది నరేష్‌కుమార్, రామకృష్ణారెడ్డి, భక్తరాజు, నరసింహ, రమేష్, సత్తి, రైతులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి మాట్లాడారు, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.



దేవరకద్రలో రెవెన్యూ సదస్సును తనిఖీ చేస్తున్న కలెక్టర్

పొరపాట్లకు తావివ్వొద్దు

నవాబ్‌పేట,(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న భూభారతి కార్యక్రమంలో పొరపాట్లకు తావివొద్దని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం మండలంలోని కొల్లూర్ గ్రామంలో నిర్వహించిన భూభారతి కార్యక్రమాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మొత్తం 21 మంది రైతులు వివిధ సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేశారు. నాయకులు వాసుయాదవ్, మార్కెట్ వైస్ చైర్మన్ తులసీరాం, సున్నాల క్రిష్ణయ్య, వెంకటయ్య, ఖాజ, నర్సింహాచారీ, క్రిష్ణయ్య రెవిన్యు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

మహబూబ్ నగర్ కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థిని, విద్యార్థులు చదువుకునేందుకు అనువైన మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ అధికారులు, గురుకుల పాఠశాలల ఆర్‌సీవోలు, డీసీవోలు, ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. సాంఘిక సంక్షేమ గురకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం అయ్యాయని, ఈ మేరకు గోడపత్రికను ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఈవో ప్రవీణ్ కుమార్, డీఆర్‌డీవో నర్సింహులు, శంకరాచారి, ఇందిర, కె. జనార్ధన్, డి. సునిత పాల్గొన్నారు.

పర్యావరణ పరిశుభ్రత మనందరి బాధ్యత

జడ్చర్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిశుభ్రత మనందరి బాధ్యత అని జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డిలు అన్నారు. జడ్చర్ల మునిసిపాలిటీ వంద రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ఒక మార్పు - అభివృద్ధికి మలుపు కార్యక్రమంలో భాగంగా బుధవారం మునిసిపాలిటీలోని 24వ వార్డులో కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి అధ్యక్షతన పర్యావరణ పరిశుభ్రత మనందరి బాధ్యత అంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా వారు మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్‌లకు బదులుగా బట్టబస్తాలను, జనపనారతో తయారు చేసిన బస్తాలను వినియోగించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా మునిసిపాలిటీ వాహనంలో వేయాలని సూచించారు. 24వ వార్డులో తాత్కాలికంగా ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. స్థానికులు సాహితిరెడ్డి పాల్గొన్నారు.



పర్యావరణ పరిసరాల పరిశుభ్రత ర్యాలీ నిర్వహిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్, సిబ్బంది, స్థానికులు

పాట రాసిన ఆటో డ్రైవర్‌కు సన్మానం



ఆటో డ్రైవర్‌ను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

జడ్చర్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్‌గా జీవనోపాధి పొందుతూ పాట రాసిన ఆటో డ్రైవర్ బొల్లె చెన్నయ్యను ఆటో యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని సిగ్నల్‌గడ్డ వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో 'పార్లెజీ బుగ్గలోడా' అనే పాటను రాసి, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశాడని, ఆ పాటకు ఎంతో ప్రాచుర్యం లభించడం పట్ల ఆటో యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శాలువా కప్పి, పూలమాలతో బొల్లె చెన్నయ్యను సన్మానించారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు షేక్‌హజీ, ఉపాధ్యక్షుడు నర్సింగ్, కార్యదర్శి మహమ్మద్ ఖాజా, సభ్యులు కొంగళి వెంకటయ్య, ఇమ్రాన్‌లతో పాటు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య డ్రైవ్‌లో నిర్లక్ష్యం వద్దు

కోయిలకొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిస్తున్న పారిశుధ్య డ్రైవ్ కార్యక్రమంలో నిర్లక్ష్యం వహించరాదని ఎంపీడీవో కాళప్ప సూచించారు. బుధవారం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పారిశుధ్య డ్రైవ్‌లో గ్రామంలో చెత్తను తొలగించి మురుగు కాలువలను శుభ్రం చేయాలని తెలిపారు. రోడ్ల వెంట ఇరువైపులా శుభ్రం చేయించి వనమహోత్సవంలో మొక్క నాటించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. సూపరింటెండెంట్ హరీష్‌రెడ్డి, ఏపీవో నర్సయ్య పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలి

భూత్పూర్, జూన్ 18(ఆంధ్రజోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించుకోవాలని గృహనిర్మాణ శాఖ ఏఈ జేఎస్ఆర్ కుమార్ సూచించారు. బుధవారం మునిసి పాలిటీలోని 10వ వార్డులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణంపై నమూనా చిత్రం వేసి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో, పట్టణాల్లో చాలా మంది ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు ప్రభుత్వ నిబంధనల మేరకు కాకుండా ఇష్టారీతిన నిర్మాణం చేపడితే నిధులు మంజూరు కావన్నారు. మునిసిపల్ కమిషనర్ నురూల్ నజీబ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, నాయకులు విజయ్‌గౌడ్, సాయికుమార్, వార్డు అధికారులు వెంకట్‌రెడ్డి, ఆర్పీలు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి కృత్రిమ కాలు ఏర్పాటు



కృత్రిమ కాలుతో మండ్ల వెంకటేశ్

జడ్చర్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలోని 17వ వార్డు శాంతినగర్ కాలనీకి చెందిన మండ్ల వెంకటేశ్‌కు కృత్రిమ కాలును జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అమర్చింపచేశారు. గత సంవత్సరం రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన వెంకటేశ్ స్టాండు ఆధారంతో నడుస్తున్నాడు. పరిస్థితిని ఎమ్మెల్యే దృష్టికి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు బజ్జు తీసుకెళ్లాడు. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో మండ్ల వెంకటేశ్‌కు ప్లాస్టిక్‌తో తయారు చేసిన కృత్రిమ కాలును అమర్చారు. స్థానిక నాయకులు బాదం బజరంగ్, అంజిలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

గండీడ్, జూన్ (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, గండీడు మండలంలోని బల్సూరుగొండ శివారులో విద్యుదాఘాతంతో ఓ గేదె చనిపోయింది. గ్రామానికి చెందిన రైతు ఎం జైపాల్‌రెడ్డి బుధవారం గ్రామ సమీపంలో పశువులను మేపుతున్నాడు. మేత మేస్తూ ట్రాన్స్‌ఫారం వద్దకు వెళ్లిన ఓ గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. దాని విలువ రూ. 50 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

నూతన విద్యార్థులకు అక్షరాభ్యాసం

రాజాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్లేపల్లి గ్రామంలోని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఒకటవ తరగతిలో చేరిన విద్యార్థులకు మండల విద్యాధికారి సుధాకర్ పాల్గొని విద్యార్థులచే అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ప్రతీ విద్యార్థికి పాఠ్య, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటరామిరెడ్డి, విష్ణువర్ధన్‌గౌడ్, గ్రామస్థులు శ్రీశైలం, భరత్ రెడ్డి, మాధవాచారి, సీఆర్పీ లక్ష్మణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని పాఠశాలలో విలేజ్ ఎడ్యుకేషన్ రిజిష్టర్‌ను అప్‌డేట్ చేయాలి

జడ్చర్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలంలోని అన్ని పాఠశాలలో విలేజ్ ఎడ్యుకేషన్ రిజిష్టర్(వీఈఆర్) అప్‌డేట్ చేసుకోవాలని జడ్చర్ల ఎంఈవో మంజులాదేవి సూచించారు. జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నోడల్‌అధికారి జగదీశ్, హెచ్ఎం శ్రీనివాసులు, అనంతప్ప పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన విద్య

- **పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన విద్య అందిస్తున్నట్లు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు రూపొందించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారన్నారు. ప్రిన్సిపాల్ భగవంతచారి, అధ్యాపకులు పాల్గొన్నారు .

రైతు భరోసా పంపిణీలో రాజకీయమా..

- **తహసీల్దార్, ఏవోలకు బీఆర్ఎస్ నాయకులు వినతి**



వ్యవసాయ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు వెంకట్‌రాంరెడ్డి, రైతులు

మహమ్మదాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రైతులకు పెట్టుబడి సాయంగా అందిస్తున్న రైతు భరోసా పంపిణీ విషయంలో రాజకీయం చేయడం తగదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకట్‌రాంరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి నరేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సపోర్టు చేశారని మండల పరిధిలోని గాధిర్యాల్ గ్రామానికి చెందిన పలువురు రైతులకు రైతుభరోసా రాకుండా అధికారుల చేత వారి సర్వే నెంబర్‌లను బ్లాక్ చేయించారన్నారు. వ్యవసాయం చేసుకొని జీవనం సాగించే ఎకరా, రెండు ఎకరాలు ఉన్న రైతులకు కూడా రైతుభరోసా ఇవ్వకుంటే ఎలా అని ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్ దృష్టి పెట్టాలని, అర్హులైన రైతులందరికీ రైతు భరోసా డబ్బులు అందేలా చూడాలన్నారు. మాజీ ఉప సర్పంచ్ చౌదరి నారాయణ, మాజీ వైస్‌ఎంపీపీ బోయిని కిష్టయ్య, పార్టీ నాయకులు కోట్ల రాములు, శీలం హన్మయ్య, రైతులు పుట్టి శంకయ్య, బదికే బాలయ్య, రాములు తదిరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగిస్తున్న నాయకులు

- **బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్**

మిడ్జిల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవాస్‌యోజన పథకం కింద ఇస్తున్న ఇళ్లను రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో తప్పుడు ప్రచారం చేస్తూ కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి అన్నారు. మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో బుధవారం పీఎం నరేంద్ర మోదీ 11 సంవత్సరాల సుపరిపాలన, వికసిత్ భారత్ రచ్చబండ కార్యక్రమాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు నరేందర్, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, నాయకులు వాసుదేవ్, భీమయ్య, ఎల్లయ్య, అంజి, హుస్సేన్, రామకృష్ణ, బాలరాజ్‌గౌడ్, దేవేందర్, అంజనేయులు, రాఘవులు, గణేష్, రాములు, శ్రీకాంత్, శివ, ఆంజనేయులు, శ్రీశైలం, మల్లేష్, మల్లయ్య, బాలోజీ, రామచంద్రయ్యతో పాటు తదితరులున్నారు.

మోటూరి జీవితం సమాజానికి ఆదర్శం



మోటూరి హనుమంతరావుకు నివాళి అర్పిస్తున్న సీపీయం నాయకులు

పాలమూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మోటూరి హనుమంతరావు జీవితం నేటి సమాజానికి ఆదర్శమైనదని సీపీఎం జిల్లా నాయకుడు కిల్లె గోపాల్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మోటూరి హనుమంతరావు 24వ వర్ధంతిని నిర్వహించారు. మోటూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లడుతూ విద్యార్థి దశనుంచే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. సీపీఎం పార్టీకి 18ఏళ్లపాటు రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారని చెప్పారు. కార్తీక్, ఆదివిష్ణు, భరత్, సురేష్, ప్రవీణ్, నందు, జానకి పాల్గొన్నారు.

కూలీల సమస్యలను పక్కదారి పట్టిస్తున్న ప్రభుత్వాలు

జడ్చర్ల, (ఆంధ్రజ్యోతి) : కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పక్కదారి పట్టిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు ఆరోపించారు. జడ్చర్లలోని అంబేడ్కర్ కళాభవన్‌లో బుధవారం నిర్వహించిన సీపీఎం శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. సీపీఎం నాయకులు కురుమూర్తి, దీప్లానాయక్, జగన్, భీమ్లానాయక్, చందర్, నరసింహ, ఈర్లపల్లియాదయ్య, శ్రీశైలం, లక్ష్మీదేవి, రామచంద్రయ్య, చెన్నయ్య, యాదమ్మ, జంగమ్మ, సంధ్యారాణి, పుష్ప, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వడెన్న గంధోత్సవం



గంధం ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కోయిలకొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కోయిలకొండ మండల కేంద్రంలోని షా అబ్దుల్ రహమాన్ వడెన్న దర్గా గంధం ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపది షా అబ్దుల్ రహమాన్ ఇంటిలో మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గంధం ఊరేగింపునకు తరలించారు. దర్గాకు చాదర్, సుగంధ ద్రవ్యాలు, గులాబీ పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లిం మత పెద్దలతో ఖవ్వాలి నిర్వహించారు. వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. మత పెద్దలు షకీల్, రహీల్, ఇనియత్‌తుల్లా, అజీజ్, షీరాజ్‌దొద్దిన్, అజెల్లీ, ఖాజ, గౌస్, రుస్తుమ్, సోహెల్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, నాయకులు విక్రమ్ తేజగౌడ్, రామస్వామి, నాగరాజు, కె.రాజు, మనోజ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి వేడుకలు

భూత్పూర్,(ఆంధ్రజ్యోతి); భూత్పూర్ మండలంలోని వెల్కిచర్ల గ్రామంలో గ్రామస్థులు అంతా కలిసి గ్రామంలో ఉన్న బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం నుంచి గ్రామంలో ఉన్న గ్రామ దేవతలకు మహిళలు, చిన్న పిల్లలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం గ్రామంలో బొడ్రాయి దగ్గర ప్రతీ ఇంటి నుంచి తీసుకొచ్చిన కలశంలోని నీటితో జలాభిషేకం చేశారు. అనంతరం సాయంత్రం వేళ గ్రామస్థులు, మహిళలు బొడ్రాయికి ప్రత్యేక బోనాలు, నైవేద్యాలు సమర్పించారు.

అనుమతి లేని వరి విత్తనాలు పట్టివేత

- **వ్యాపారిపై కేసు నమోదు**

భూత్పూర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి); ఎలాంటి అనుమతులు, లైసెన్స్ లేకుండా దొంగ చాటుగా వరి విత్తనాలను అమ్ముతున్న వ్యాపారిని వ్యవసాయ శాఖ ఏవో పట్టుకొని పోలీసులకు అప్పజెప్పారు. ఈ సంఘటన బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాటికొండ గ్రామ శివారులోని డీసీఎం వాహనంలో వరి బీపీటీ- 5204 200బ్యాగులు, వీటి విలువ రూ.3లక్షలు, అదే విధంగా ఆర్ఎన్ఆర్ 15048 వరి విత్తనాలు 200బ్యాగులు, వీటి విలువ రూ.2.50లక్షలు, అదే విధంగా కేఎన్ఎం 7715రకం వరి విత్తనాలు 250 బ్యాగులు, వీటి విలువ రూ.3.12లక్షలు ఉన్నట్లుగా వ్యవసాశాఖ అధికారి మురళీధర్ అంచనా వేశారు. అయితే ఈ విత్తనాలు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని పెద్దయ్యాపల్లి పరకాల చౌరస్తాలో ఉన్న సీడ్స్ ప్రాసెసింగ్ ప్లాంట్ నుంచి గద్వాలలోని రాజరాజేశ్వరి ట్రేడర్స్‌కు వెళ్లాల్సి ఉంది. వ్యాపారి చంద్రశేఖర్‌రెడ్డి భూత్పూర్ మండలంలోని తాటికొండ గ్రామ శివారులో డీసీఎంలో ఉన్న కేఎన్ఎం-7715 వరి విత్తనాలు 250బ్యాగులను వ్యాపారి స్థానిక రైతులకు ఎలాంటి బిల్లులు లేకుండా వరి విత్తనాలను అమ్ముతున్న విషయాన్ని మండల వ్యవసాయశాఖ అధికారి మురళీధర్ విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు వెళ్లి పరిశీలించారు. డీసీఎంలో పైన పేర్కొన్న విత్తనాలు ఎలాంటి అనుమతులు లేకుండా అమ్ముతున్నట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విత్తన యాక్టు ప్రకారం అనుమతులు లేని విత్తనాలు అమ్ముతున్న గద్వాలకు చెందిన శ్రీరాజరాజేశ్వరి ట్రేడర్స్ దుకాణ యజమానిపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.